సాక్షి యాదాద్రి భువనగిరి

మంగళవారం ; 28 ; నవంబర్ ; 2023



యాదాద్రిలో తులసీ కల్యాణం

యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో తులసీ కల్యాణం కనుల పండువగా నిర్వహించారు.

- 6లో



పోలింగ్‌కు సన్నద్ధం కావాలి

పోలింగ్‌కు సంబంధించిన విధులు బాధ్యతాయుతంగా నిర్వర్తించాలని కలెక్టర్ ఆదేశించారు.

- 6లో



సామాజిక న్యాయానికి పెద్దపీట

సామాజిక న్యాయానికి నరేంద్రమోదీ సర్కార్ పెద్ద పీట వేస్తుందని మందకృష్ణ మాదిగ పేర్కొన్నారు.

- 6లో

న్యూస్‌రీల్

సాహిత్య కళా ఉత్సవాల ఆర్గనైజర్‌గా నేతాజీ



మోత్కూరు : ఆంధ్ర ప్రదేశలోని తాడేపల్లి గూడెంలో వచ్చే నెల 16,17 తేదీల్లో నిర్వహించనున్న ప్రపంచ సాహిత్య కళా ఉత్సవాల ఆర్గనైజింగ్ కార్యదర్శిగా మోత్కూరు మండలంలోని పాలడుగు గ్రామానికి చెందిన కొపల్లి నేతాజీ నియమితులయ్యారు. ఈ మేరకు శ్రీ శ్రీ కళా వేదిక చైర్మన్ ప్రతాప్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా నేతాజీ మాట్లాడుతూ.. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న కవులు, కళాకారులు, రచయితలు పాల్గొనే సాహిత్య కళా ఉత్సవాల ఆర్గనైజింగ్ సెక్రటరీగా అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నానని పేర్కొన్నారు. తనకు ఈ బాధ్యతలు అప్పగించిన శ్రీశ్రీ కళా వేదిక నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఆసక్తి ఉన్న కవులు, కళాకారులు, రచయితలు ఉత్సవాల్లో పాల్గొనడానికి డిసెంబర్ 1లోపు పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

యాదాద్రిలో ఆధ్యాత్మిక పర్వాలు



శివాలయంలో స్పటిక లింగానికి హారతినిస్తున్న పూజారి

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంతో పాటు అనుబంధంగా ఉన్న శ్రీపర్వత వర్ధిని సమేతా రామలింగేశ్వరస్వామి క్షేత్రంలో సోమవారం ఆధ్యాత్మిక పర్వాలు విశేషంగా చేపట్టారు. శివుడికి ఇష్టమైన రోజు, మరోవైపు కార్తీక పౌర్ణమి కాలిసి రావడంతో అభిషేకం చేశారు. అలాగే రుద్రాభిషేకం, బిల్వార్చన గావించారు. ఇక ప్రధానాలయంలో స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులకు సంప్రదాయ పూజలు కొనసాగాయి. నిత్యకల్యాణం, శ్రీసుదర్శన నారసింహహోమం, సువర్ణ పుష్పార్చన, జోడుసేవలు తదితర కైంకర్యాలు గావించారు. ఆయా వేడుకల్లో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



భూదాన్‌పోచంపల్లిలో పోలింగ్ బూత్‌ను పరిశీలిస్తున్న ఎన్నికల పరిశీలకుడు

భూదాన్‌పోచంపల్లి : పట్టణంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను సోమవారం కేంద్ర సాధారణ పరిశీలకుడు సీఎస్ మహేశ్వరన్ పరిశీలించారు. దివ్యాంగుల కోసం ఏర్పాటు చేసిన ర్యాంపులు, మూత్రశాలలు, కరెంట్ తదితర సౌకర్యాలను పరిశీలించారు. ఓటర్లకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలని, పటిష్ట బందోబస్తు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఆయన వెంట అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారిణి వీరబాయి, ఎంపీడీఓ బాలశంకర్, ఎంపీఓ మాజిద్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా సెల్ఫీ పాయింట్



భువనగిరి బస్టాండ్‌లో వృథాగా ఉన్న సెల్ఫీ పాయింట్ బోర్డు

భువనగిరిటౌన్ : పోలింగ్ శాతం పెంచేందుకు ఎన్నికల సంఘం వివిధ కార్యక్రమాలు చేపడుతోంది. అందులో భాగంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో సెల్ఫీ పాయింట్‌లు ఏర్పాటు చేశారు. కాగా భువనగిరి బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన సెల్ఫీ పాయింట్ బోర్డు విరిగిపోయి నిరుపయోగంగా మారింది.

మెగా రక్తదాన శిబిరం

రామగిరి(నల్లగొండ): ఎన్‌సీసీ దినోత్సవం సందర్భంగా సోమవారం నల్లగొండలోని ఎన్జీ కళాశాలలో ఎన్‌సీసీ, రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో ఎన్‌సీసీ క్యాడెట్లు పలువురు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఎన్‌సీసీ ఆఫీసర్ చిలుముల సుధాకర్, లైబ్రేరియన్ డాక్టర్ ఏ.దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.





జలదీపోత్సవం | పోచంపల్లిలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో జలదీపోత్సవంలో పాల్గొన్న సినీ నటి ఆమని, శైలజ వనిత, విజయలక్ష్మి

నేడు ప్రచారానికి ఆఖరు

- సాయంత్రం 5 గంటలకు ముగింపు
- చివరి రోజు ఓటర్లకు మరింత చేరువయ్యేందుకు అభ్యర్థులు సిద్ధం

సాక్షి, యాదాద్రి : అసెంబ్లీ ఎన్నికల్లో కీలకమైన ప్రచార ఘట్టానికి నేటితో తెరపడనుంది. మంగళవారం సాయంత్రం 5గంటలకు ప్రచారం ముగియనుంది. ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ప్రధాన రాజకీయ పార్టీలు.. నెల రోజులుగా హోరాహోరీ ప్రచారం సాగిస్తున్నాయి. బహిరంగ సభలు, రోడ్ షోలు, కార్నర్ మీటింగ్‌లతో పోటాపోటీగా తలపడుతున్నాయి. రాష్ట్ర, జాతీయ స్థాయి నేతలను సైతం రంగంలోకి దింపాయి. సమ్మేళనాల పేరుతో కులసంఘాల ఓట్లను గంపగుత్తగా వేయించుకునే ప్రయత్నం చేశాయి. మరికొద్ది గంటల్లో ప్రచారం ముగియనుండడంతో అభ్యర్థులు మరింత దూకుడు పెంచనున్నారు.

మొదలైన ప్రలోభాల పర్వం!

ఎన్నికలు చివరి అంకానికి చేరిన నేపథ్యంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రలోభాల పర్వం మొదలైంది. పోలింగ్‌కు మరో మూడు రోజులు సమయం ఉన్నప్పటికీ అభ్యర్థులు నాలుగు రోజుల నుంచే ఓటర్లకు నగదు పంచుతున్నారన్న ప్రచారం జరుగుతోంది. స్థానిక నేతలతోనే కాకుండా స్థానికేతరుల ద్వారా డబ్బు పంపిణీ జరుగుతోందని సమాచారం. చీరల కోసం మహిళా సంఘాలకు డబ్బులు ఇచ్చినట్లు తెలుస్తోంది. ఓ పార్టీ ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించి ఓటర్లకు మద్యం, డబ్బులు పంచినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి.

గెలుపు దక్కేదెవరికి?

కొన్ని చోట్ల నువ్వా నేనా.. మరికొన్ని చోట్ల త్రిముఖ పోటీ

అసెంబ్లీ ఎన్నికల్లో ప్రధాన ఘట్టమైన పోలింగ్‌కు గడువు దగ్గరపడింది. 30న ఉదయం నుంచే పోలింగ్ జరగనుండగా.. అభ్యర్థుల పోల్ మేనేజ్‌మెంట్‌కు సమయం రెండు రోజులు ఉంది. మంగళవారం సాయంత్రంతో ప్రచారం ముగియనుంది. 29వ తేదీన కూడా సభలు సమావేశాలు మినహా ఇంటింటి ప్రచారం చేసుకునే వీలు ఉంది. అయితే ఇప్పటివరకు నిర్వహించిన ప్రచారం ఆధారంగా ఇంకా తాము ఏయే పట్టణాలు, మండలాలు, గ్రామాల్లో బలహీనంగా ఉన్నామో తెలుసుకొని పార్టీ శ్రేణులను రంగంలోకి దింపాయి. కొన్ని చోట్ల నువ్వా నేనా అన్నట్లుగా, మరికొన్ని చోట్ల త్రిముఖ పోటీ ఉంది.

–సాక్షి ప్రతినిధి, నల్లగొండ

- పోల్ మేనేజ్‌మెంట్‌కు రెండు రోజులే గడువు
- వ్యూహ, ప్రతివ్యూహాల్లో అభ్యర్థులు
- పార్టీ శ్రేణులు ప్రతీ ఓటరును కలిసేలా ప్రణాళిక



నల్లగొండ జిల్లాలో మూడింట సై అంటే సై

- నల్లగొండ నియోజకవర్గంలో ఇద్దరి మధ్యే పోటీ నెలకొంది. ఇక్కడ బీఆర్ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులైన కంచర్ల భూపాల్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మధ్యే కీలక పోరు సాగుతోంది. బీజేపీ నుంచి మాదగోని శ్రీనివాస్‌గౌడ్, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ (ఏఐఎఫ్‌బీ) పార్టీ నుంచి పిల్లి రామరాజుయాదవ్ బరిలో ఉన్నారు. ఇక్కడ బీజేపీ సంప్రదాయ ఓట్లు బీజేపీకే పడనుండగా, ఆయన అదనంగా ఏ మేరకు ఓట్లను సాధిస్తారన్నది పోలింగ్ రోజే తేలనుంది. మరోవైపు పిల్లి రామరాజుయాదవ్ యాదవ సామాజికవర్గంతోపాటు బీసీల ఓట్లు తనకు పడేలా ప్రయత్నిస్తున్నారు. ఈయన చీల్చే ఓట్లు.. కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపోటముల్లో ప్రధానం కానున్నాయి.
- నకిరేకల్‌లో బీఆర్ఎస్ అభ్యర్థి చిరుమర్తి లింగయ్య, కాంగ్రెస్ అభ్యర్థి వేముల వీరేశం మధ్య హోరాహోరీగా పోటీ సాగుతోంది. ఇక్కడ చేసిన అభివృద్ధి, ప్రభుత్వ సంక్షేమ పథకాలే తనను గెలిపిస్తాయని బీఆర్ఎస్ అభ్యర్థి ధీమాగా ఉండగా, కాంగ్రెస్ పార్టీకి ఉన్న జోష్, మాజీ ఎమ్మెల్యేగా తనకున్న వ్యక్తిగత అనుచర వర్గ బలంతో గెలుపు సాధిస్తానన్న ధీమాతో కాంగ్రెస్ అభ్యర్థి ఉన్నారు.
- నాగార్జునసాగర్‌లోనూ ఇద్దరి మధ్యే ప్రధాన పోటీ నెలకొంది. కాంగ్రెస్ అభ్యర్థి కుందూరు జైవీర్‌రెడ్డి.. కాంగ్రెస్ పార్టీ కేడర్, తన తండ్రి జానారెడ్డి చరిష్మా తనను కచ్చితంగా గెలిపిస్తుందన్న ధీమాలో ఉన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి నోముల భగత్ నియోజవర్గ అభివృద్ధికి తాను తీసుకుకొచ్చిన నిధులు, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలే తనను గెలిపిస్తాయనే నమ్మకంతో ఉన్నారు. ఈ రెండు నియోజకవర్గాల్లోనూ బీజేపీ, ఇతర పార్టీలు భారీ ప్రభావం చూపుతాయన్న అంచనాలు లేవు.

మిర్యాలగూడ, మునుగోడు, దేవరకొండలో ట్రయాంగిల్

- మిర్యాలగూడలో బీఆర్ఎస్ అభ్యర్థి నల్లమోతు భాస్కర్‌రావు తాను చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, వ్యక్తిగతంగా తమకున్న పట్టుతో గెలుస్తానని భావిస్తుండగా, కాంగ్రెస్ అభ్యర్థి లక్ష్మారెడ్డి కూడా తన వ్యక్తిగత చరిష్మా, పార్టీ వేవ్ పైనే ఆధార పడ్డారు. ఇదే నియోజకవర్గం నుంచి మూడుసార్లు గెలుపొందిన మాజీ ఎమ్మెల్యే, సీపీఎం అభ్యర్థి జూలకంటి రంగారెడ్డి తన వ్యక్తిగత చరిష్మాతోపాటు పార్టీకి ఉన్న బలంతో గెలుస్తానన్న ధీమాలో ఉన్నారు.
- మునుగోడులో బీఆర్ఎస్ అభ్యర్థి కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థి కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, బీజేపీ అభ్యర్థి చలమల్ల కృష్ణారెడ్డి మధ్య పోరు నెలకొంది. ఉప ఎన్నికల తరువాత సీఎం ఇచ్చిన హామీ మేరకు నియోజకవర్గంలో చేపట్టిన చేసిన అభివృద్ధి పనులు, సంక్షేమ కార్యక్రమాలే తనను గెలిపిస్తాయని బీఆర్ఎస్ అభ్యర్థి భావిస్తుండగా, నియోజకవర్గంలో తనకున్న వ్యక్తిగత చరిష్మా, కాంగ్రెస్ పార్టీకి ఉన్న క్రేజ్ తనను గెలిపిస్తుందని కాంగ్రెస్ అభ్యర్థి భావిస్తున్నారు. ఇక బీజేపీ అభ్యర్థి కూడా గట్టిగానే ప్రయత్నిస్తున్నారు. బీజేపీ సంప్రదాయ ఓట్లతోపాటు ఆయన చీల్చే ఇతర ఓట్లే ఈ ఎన్నికల్లో అక్కడ ప్రధానం కాబోతున్నాయి.
- దేవరకొండలో కాంగ్రెస్ అభ్యర్థి బాలునాయక్, బీఆర్ఎస్ అభ్యర్థి రవీంద్రకుమార్ మధ్య ప్రధాన పోటీ ఉండగా, బీజేపీ అభ్యర్థి కేతావత్ లాలూ నాయక్ గట్టి పోటీ ఇస్తున్నారు. ఆయన నియోజకవర్గంలో పెద్ద ఎత్తున ప్రచారం చేస్తున్నారు.

యాదాద్రిలో ముక్కోణం

- భువనగిరి నియోజకవర్గంలో త్రిముఖ పోటీ నెలకొంది. భువనగిరిలో బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి తాను చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపైనే ఆశ పెట్టుకోగా, కాంగ్రెస్ పార్టీ నుంచి కుంభం అనిల్ కుమార్‌రెడ్డి తమ పార్టీకి ఉన్న వేవ్ పైనే ఆశ పెట్టుకున్నారు. ఇక బీజేపీ అభ్యర్థి గూడూరు నారాయణరెడ్డి కేంద్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, రాష్ట ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళుతూ గెలుపొందాలని భావిస్తున్నారు.
- ఆలేరు నియోజకవర్గంలోనూ అదే పరిస్థితి నెలకొంది. బీఆర్ఎస్ అభ్యర్థి, ప్రస్తుత ఎమ్మెల్యే గత పదేళ్లలో నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు తనను మూడో సారి గెలిపిస్తాయన్న నమ్మకంతో ఉన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి బీర్ల అయిలయ్య.. పార్టీ జోష్, ప్రభుత్వ వ్యతిరేకత కలిసి వస్తుందని భావిస్తున్నారు. బీజేపీ అభ్యర్థి పడాల శ్రీనివాస్ కూడా ప్రభుత్వ వ్యతిరేకతతోపాటు కేంద్ర ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలను తనను గెలిపిస్తాయన్న నమ్మకంతో ఉన్నారు.

రెండు చోట్ల ద్విముఖం.. మరో రెండు చోట్ల త్రిముఖం

- సూర్యాపేటలో బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి నియోజకవర్గంలో విస్తృత ప్రచారం చేస్తున్నారు. సూర్యాపేటను జిల్లాగా తీర్చిదిద్దడం, చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు తనను గెలిపిస్తాయన్న ధీమాలో ఉన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి రాంరెడ్డి దామోదర్ రెడ్డి మాజీ మంత్రిగా, ఎమ్మెల్యేగా గతంలో పనిచేసిన తీరు, గత ఎన్నికల్లో ఓడిపోయారన్న సానుభూతి, కాంగ్రెస్ పార్టీకి ఉన్న క్రేజ్ తనను గెలిపిస్తాయన్న నమ్మకంతో ఉన్నారు. మాజీ ఎమ్మెల్యే, బీజేపీ అభ్యర్థి సంకినేని వెంకటేశ్వర్‌రావు ఈసారి గెలుస్తానన్న ధీమాలో ఉన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు, రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలు తనను గెలిపిస్తాయని భావిస్తున్నారు. బీఎస్పీ అభ్యర్థి జానయ్య యాదవ్ పోటీలో ఉన్నా ఎంతమేరకు బీఆర్ఎస్ ఓట్లను చీల్చుతారన్నది ఆసక్తిగా మారింది.
- హుజూర్‌నగర్‌లో కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్యే ప్రధాన పోటీ నెలకొంది. కాంగ్రెస్ అభ్యర్థి, ఎంపీ ఉత్తమ్ కుమార్‌రెడ్డికి ఉన్న వ్యక్తిగత చరిష్మా, పార్టీ జోష్ తనను గెలిపిస్తుందని భావిస్తుండగా, బీఆర్ఎస్ అభ్యర్థి సిట్టింగ్ ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు తనను గెలిస్తాయన్న నమ్మకంతో ఉన్నారు.
- కోదాడలోనూ కాంగ్రెస్ అభ్యర్థి నలమాద పద్మావతిరెడ్డి గతంలో ఓడిపోయారన్న సానుభూతి, కాంగ్రెస్ పార్టీ జోష్, ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి ఉన్న చరిష్మా తనను గెలిపిస్తాయన్న నమ్మకంతో ఉన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే పూర్తిగా ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపైనే ఆశ పెట్టుకున్నారు.
- తుంగతుర్తిలోనూ త్రిముఖ పోటీ నెలకొంది. సిట్టింగ్ ఎమ్మెల్యే గాదరి కిషోర్ కుమార్ గత పదేళ్ల కాలంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు తనను గెలిపిస్తాయన్న ధీమాతో ఉన్నారు. కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థి మందుల సామేల్ తనకున్న పేరు, పార్టీ క్రేజ్ తనను గెలిపిస్తుందని భావిస్తున్నారు. బీజేపీ అభ్యర్థి కడియం రామచంద్రయ్య రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలు, కేంద్ర పథకాలను తనను గెలిపిస్తాయన్న నమ్మకంతో ఉన్నారు.

నియోజకవర్గ ప్రజలకు మూసీ మురికి శాపంగా మారింది.. మూసీ ప్రక్షాళనపై రాష్ట్ర ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి లేదు.. స్థానికంగా ఉపాధి అవకాశాలు లేక జనం వలసబాట పడుతున్నారు.. చదువుకున్న యువతకు ఉద్యోగాలు దొరకడం లేదు.. భువనగిరిలో ఐటీ హబ్ ఆవశ్యకత ఉంది. ఎమ్మెల్యేగా ఒక్క అవకాశం ఇస్తే మార్పు చూపిస్తానంటున్నారు.. భువనగిరి అసెంబ్లీ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి గూడూరు నారాయణరెడ్డి. ఆయన 'సాక్షి'తో ప్రత్యేకంగా మాట్లాడారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

–సాక్షి యాదాద్రి

interview

- భువనగిరికి ఐటీ కారిడార్ తీసుకువస్తా
- సొంత నిధులతో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేస్తా
- బీజేపీకి ఆదరణ పెరిగింది..
- నా విజయం ఖాయమైంది

భువనగిరి బీజేపీ అభ్యర్థి గూడూరు నారాయణరెడ్డి



వనరులు, అన్ని అనుకూలతలున్నా భువనగిరి నియోజకవర్గం అనాథంగా మిగిలింది. పాలకుల నిర్లక్ష్యం వల్లే ఈ పరిస్థితి ఏర్పడింది. ఎమ్మెల్యేగా గెలిచిన వారిలో సామాజిక స్పృహ లేకపోవడంతో అభివృద్ధి జరగడం లేదు. కేవలం చిన్నచిన్న పనులకే పరిమితం అవుతున్నారు. ఎన్నికల్లో గెలిస్తే భువనగిరి సమగ్రాభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళ్తా.

మూసీ ప్రక్షాళనకు ప్రాధాన్యం

ఎమ్మెల్యేగా గెలిపిస్తే 8 నెలల్లోనే శుద్ధీకరణ

90 వేల మందికి ఉపాధి కల్పిస్తా

హైదరాబాద్, శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి భువనగిరి చేరువలో ఉంది. వీటితో రోడ్డు, రైల్వే మార్గాలు, నీటి వనరులు, భూములు ఇలా.. మరెన్నో సానుకూలతలు ఉన్నప్పటికీ భువనగిరిలో ఐటీ కారిడార్ ఏర్పాటు చేయడంలో పాలకులు విఫలమయ్యారు. ఇంజనీరింగ్, డిప్లమా వంటి సాంకేతిక కోర్సులు చేసిన వేలాది మంది ఉద్యోగాల కోసం ఎక్కడెక్కడో వెళ్తున్నారు. నేను ఎమ్మెల్యేగా గెలిస్తే 18 నెలల్లోనే ఐటీ హబ్ ఏర్పాటు చేయిస్తా. ఐటీ హబ్ ద్వారా ప్రత్యక్షంగా 30 వేలు, పరోక్షంగా 60 వేల మందికి ఉపాధి లభిస్తుంది.

మూసీని ప్రభుత్వం విస్మరించింది

మూసీ ప్రక్షాళనకు రాష్ట్ర ప్రభుత్వం మూసీ రివర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఏర్పాటు చేసిందే కానీ నిధులు మంజూరు చేయలేదు. హైదరాబాద్ జంటనగరాల్లోని కలుషిత జలాలు, పరిశ్రమల నుంచి వచ్చే కాలుష్య కారక పదార్థాలు మూసీలో కలుస్తుండడంతో ప్రజలు, రైతులు అవస్థలు పడుతున్నారు. వ్యవసాయం, పాడి పరిశ్రమ, మత్స్యసంపద దెబ్బతింటున్నాయి. సంగెం జంపల్లి, రుద్రవెల్లి వద్ద మూసీపై వంతెనలు నిర్మించక రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే కేంద్ర ప్రభుత్వ సహకారంతో 8 నెలల్లోనే మూసీని శుద్ధీకరణ చేయిస్తాం.

నిరుద్యోగులకు చేయూతనిచ్చా

ఎంతోమందిని దత్తత తీసుకుని ఉచితంగా విద్య అందజేస్తున్నా. నిరుద్యోగుల కోసం ఉచిత కోచింగ్ సెంటర్లు ఏర్పాటు చేసి ఉద్యోగాలు సాధించడంలో చేయూతనిచ్చా. భువనగిరిలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల లేదు. పేద విద్యార్థులు చదువుకోడానికి దూర ప్రాంతాలకు వెళ్తున్నారు. ఆర్థిక స్థోమత లేనివారు మధ్యలోనే చదువు ఆపేస్తున్నారు. కాబట్టి సొంత డబ్బులతో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేస్తా. ప్రభుత్వం ఫ్యాకల్టీలను నియమించాలి. అంతే కాకుండా చాలా గ్రామాలకు సరైన రవాణా సౌకర్యం లేకపోవడంతో ప్రజలు, విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. మండల కేంద్రాలకు చేరుకునేలా నా సొంత డబ్బులతో ఎనిమిది మినీ బస్సులు అందుబాటులోకి తీసుకువస్తా. వీటి వినియోగం, పర్యవేక్షణ బాధ్యతలు చూడటానికి మండలాల వారీగా కమిటీలు వేస్తాం. సబర్బన్ బస్సులను నియోజకవర్గ ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడానికి చర్యలు తీసుకుంటా.

ప్రధాన పోటీ కాంగ్రెస్‌తోనే..

బీజేపీకి ప్రధాన పోటీ కాంగ్రెస్‌తోనే ఉంటుంది. రాష్ట్ర వ్యాప్తంగా బీజేపీకి ఆదరణ పెరిగింది. దీనికి తోడు నియోజకవర్గంలో నేను చేపట్టిన సేవా కార్యక్రమాలు తోడవుతున్నాయి. ఈసారి నాకు ఎమ్మెల్యేగా అవకాశం ఇవ్వాలన్న ఆలోచనలో ప్రజలు ఉన్నారు.పల్లెలు, పట్టణాలు ఎక్కడికెళ్లినా ఆదరణ లభిస్తోంది. కాంగ్రెస్, బీఆర్ఎస్ మేనిఫెస్టోలను, ఆ పార్టీ అభ్యర్థులు ఇచ్చే వాగ్దానాలను ప్రజలు విశ్వసించడం లేదు. యువతతోపాటు అన్ని వర్గాల ప్రజల భవిష్యత్‌కు భరోసానిచ్చేదిగా బీజేపీ మేనిఫెస్టో ఉంది. బీసీని సీఎం అభ్యర్థిగా ప్రకటించడం తమ పార్టీకి కలిసి వచ్చే అంశం. ఎస్సీ వర్గీకరణకు ప్రధాని మోదీ హామీ ఇవ్వడమే కాకుండా కమిటీ కూడా వేయడంతో ఆ వర్గం నుంచి బీజేపీ పట్ల సానుకూలత ఏర్పడింది. అన్ని వర్గాల సమస్యలు, అన్ని ప్రాంతాల సమగ్రాభివృద్ధి చెందాలంటే డబుల్ ఇంజన్ సర్కార్ రావాలి. బీజేపీ అగ్రనేత అమిత్‌షా రాకతో నా విజయం ఖాయమైంది. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మద్దతుతో మాదిగల ఓట్లన్నీ నాకే పడబోతున్నాయి.

కాంగ్రెస్‌తోనే మార్పు

- భువనగిరిలో సమస్యలను ఎమ్మెల్యే ఏనాడూ పట్టించుకోలేదు
- ప్రజల పక్షాల నిలిచిన అనిల్‌కుమార్‌రెడ్డిని గెలిపించండి
- భువనగిరి రోడ్ షోలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకగాంధీ

భువనగిరి టౌన్ : 'భువనగిరి నియోజకవర్గంలో అనేక సమస్యలు ఉన్నాయి.. అయినా మీ ఎమ్మెల్యే ఏనాడూ మీ సమస్యలు పట్టించుకోలేదు.. మార్పు రావాలంటే కాంగ్రెస్‌ను గెలిపించాలి' అని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకగాంధీ పిలుపునిచ్చారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం భువనగిరిలో కాంగ్రెస్ అభ్యర్థి కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి తరఫున రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రీజినల్ రింగ్ రోడ్డు ప్రాజెక్టు విషయంలో అనేక లోటుపాట్లు ఉన్నాయని, భూములు కోల్పోతున్న రైతులపక్షాన అనిల్‌కుమార్‌రెడ్డి నిలబడి ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటం చేశారని పేర్కొన్నారు. రీజినల్ రింగ్ రోడ్డు, కాళేశ్వరం ప్రాజెక్టులలో పెద్ద ఎత్తున అవినీతి చోటు చేసుకుందని ఆరోపించారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ఆ పార్టీ నేతలు ధనవంతులయ్యారని, ప్రజలు మాత్రం పేదవారిగానే ఉన్నారని పేర్కొన్నారు. తెలంగాణలో మార్పు కోసం కాంగ్రెస్ అధికారంలోకి రావాలని, అనిల్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. రోడ్‌షోలో రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జ్ మాణిక్‌రావ్‌ఠాక్రే, నాయకులు పాల్గొన్నారు.

జై తెలంగాణ అంటూ తెలుగులో నినాదం

రోడ్‌షోకు పార్టీ కార్యకర్తలు, ప్రజలు భారీగా తరలివచ్చారు. మార్పు రావాలంటే కాంగ్రెస్ రావాలని ప్రియాంకగాంధీ పదేపదే తెలుగులో ప్రసంగించారు. జై తెలంగాణ అంటూ తెలుగులో నినదించడంతో పార్టీ శ్రేణులు హర్షధ్వానాలు పలికారు.

స్థానికేతరులు మనకొద్దు : కుంభం

స్థానిక సమస్యలపై అవగాహన లేని స్థానికేతరులు మనకు ఎమ్మెల్యేగా అవసరం లేదని కాంగ్రెస్ అభ్యర్థి కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. నియోజకవర్గ సమస్యలపై అసెంబ్లీలో ఏరోజు ప్రస్తావించని వ్యక్తి.. ఎమ్మెల్యేగా అవసరమా అని ప్రశ్నించారు. ఎమ్మెల్యే కేవలం సీసీ రోడ్లు, డ్రెయినేజీలు వేసి అభివృద్ధి చేశామని గొప్పలు చెప్పుకుంటున్నాడని, అభివృద్ధి అంటే విద్య, ఉద్యోగాలు, ఆరోగ్యం, సాగు, తాగునీటి సమస్య పరిష్కరిచడమన్నారు. డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిర్మించి కేటాయించకుండా వదిలేశారని పేర్కొన్నారు. పాలకులు పదేళ్లుగా ప్రజల డబ్బు దొచుకున్నారే తప్ప.. వారికి చేసిందేమీ లేదన్నారు. ఎన్నికల్లో డబ్బు పంపిణీ చేసి మళ్లీ గెలవాలని ప్రయత్నిస్తున్నారని, ప్రజలు వారిచ్చిన డబ్బు తీసుకుని కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని కోరారు.



భువనగిరిలో జరిగిన రోడ్ షోలో ప్రసంగిస్తున్న ప్రియాంకగాంధీ, చిత్రంలో అభ్యర్థి అనిల్‌కుమార్‌రెడ్డి



రోడ్ షోలో పాల్గొన్న కాంగ్రెస్ కార్యకర్తలు, ప్రజలు

పోలింగ్‌కు సన్నద్ధం కావాలి

- కలెక్టర్ హనుమంతు కె.జెండగే

సాక్షి,యాదాద్రి : పోలింగ్‌కు సంబంధించి ప్రతి పని బాధ్యతాయుతంగా నిర్వర్తించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హనుమంతు కె.జెండగే సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో నోడల్, సెక్టార్ అధికారులతో సమావేశమై వారికి పోలింగ్ విధులను వివరించారు. 28న పోలింగ్ సిబ్బందికి ర్యాండమైజేషన్ చేపట్టి ఎవరి విధులు ఎక్కడనేది సమాచారం పంపుతామన్నారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల్లో చెక్‌లిస్టు ప్రకారం పోలింగ్ సామగ్రి తీసుకోవాలని, ఈవీఎంల నంబర్లను జాగ్రత్తగా పరిశీలించుకోవాలని పేర్కొన్నారు. మాక్ పోలింగ్ అనంతరం 7 గంటలకు అసలైన పోలింగ్ ప్రారంభించి నివేదికలు పంపాలని సూచించారు.9 నుంచి ప్రతి రెండు గంటలకు ఒకసారి పోలైన ఓట్ల వివరాలను తెలియజేయాలన్నారు. పోలింగ్ ముగిసిన అనంతరం ప్రిసైడింగ్ అధికారి ఇచ్చే రిపోర్ట్, డైరీ చెక్ చేసుకున్న తర్వాతనే పోలింగ్ బూత్ నుంచి బయటకు రావాలని తెలిపారు. ఓటరు గైడ్, పోటీలో వున్న అభ్యర్థుల వివరాలను తెలియజేసే పోస్టర్‌ను ప్రదర్శించాలని పేర్కొన్నారు. కార్యక్రముంలో అదనపు కలెక్టరు భాస్కర్ రావు పాల్గొన్నారు.

ఎస్ఎంఎస్‌లు నిషేధం

భువనగిరిటౌన్ : పోలింగ్ రోజుకు ముందు 48 గంటల పాటు అభ్యంతకరమైన బల్క్ ఎస్ఎంఎస్‌లు ప్రచారం చేయడం నిషేధమని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హనుమంతు కె.జెండగే ఒక ప్రకటనలో తెలిపారు. 28వ తేదీ (నేడు) సాయంత్రం 5నుంచి 30వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు రాజకీయపరమైన బల్క్ ఎస్ఎంఎస్ ప్రసారాలు నిలుపుదల చేయవలసిందిగా ఎన్నికల కమిషన్ ఆదేశించిందని, జిల్లాలో పోటీ చేస్తున్న అభ్యర్థులు ఆ మేరకు నడుచుకోవాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే ఎన్నికల చట్టం ప్రకారం చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అదే విధంగా ఎస్ఎంఎస్‌లు పంపడానికి అయ్యే ఖర్చు కూడా పరిగణలోకి తీసుకోనున్నట్లు చెప్పారు. అభ్యర్థులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పోలింగ్‌కు ముందు రోజు, పోలింగ్ రోజు ప్రింట్ మీడియాకు ప్రకటనలివ్వాలనుకున్న రాజకీయ పార్టీలు, అభ్యర్థులు తప్పనిసరిగా అనుమతి పొందాలని కలెక్టర్ తెలిపారు.

వైన్స్‌లు బంద్

భువనగిరి క్రైం : పోలింగ్ సందర్భంగా 28 సాయంత్రం 5గంటల నుంచి 30వ తేదీ పోలింగ్ ముగిసే వరకు జిల్లాలో మద్యం, కల్లు దుకాణాలు మూసివేయాలని నిర్వాహకులను కలెక్టర్ ఆదేశించారు. అదే విధంగా ఓట్ల లెక్కింపు రోజు డిసెంబరు 3న వైన్స్‌లు బంద్ చేయాలని పేర్కొన్నారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

ఎన్నికల సిబ్బందికి 331 బస్సులు

- ఆరు డిపోల నుంచి బస్సుల ఏర్పాటు

నల్లగొండ రూరల్, మిర్యాలగూడ టౌన్: ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బంది, ఈవీఎంలను పోలింగ్ కేంద్రాలకు చేర్చేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఇందు కోసం ఎన్నికల అధికారులు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మొత్తం 331 ఆర్టీసీ బస్సులను సమకూర్చారు. మధ్యలో ఏదైనా సమస్య తలెత్తితే వెంటనే మరో బస్సును అందుబాటులో ఉంచేలా అదనంగా మరో 10 బస్సులను సిద్ధంగా ఉంచారు. పోలింగ్ సామగ్రి, ఎన్నికల సిబ్బందిని తరలించే సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ ఎస్కార్ట్ ఉంటుంది.

జిల్లాల వారీగా బస్సుల వివరాలు..

నల్లగొండ జిల్లా నుంచి 142, సూర్యాపేట జిల్లా నుంచి 124, యాదాద్రి భువనగిరి జిల్లా నుంచి 65

డిపోల వారీగా ఇలా..

నల్లగొండ డిపో నుంచి 55, మిర్యాలగూడ డిపో



నుంచి 34, దేవరకొండ డిపో నుంచి 53, కోదాడ డిపో నుంచి 66, సూర్యాపేట డిపో నుంచి 58, యాదాద్రి భువనగిరి డిపో నుంచి 65 బస్సులు.

రెండు రోజులు తప్పని ఇబ్బందులు..

30వ తేదీన పోలింగ్ కావడంతో ఒక రోజు ముందుగానే పోలింగ్ సామగ్రి, ఎన్నికల సిబ్బందిని పోలింగ్ కేంద్రాలకు తరలిస్తుండడంతో ఈ రెండు రోజులు ప్రయాణికులు కాస్త ఇబ్బందులు పడే అవకాశం ఉంది. అయితే ప్రయాణికులు ఎటువంటి ఇబ్బందులు పడకుండా ఆర్టీసీ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టనున్నారు.

ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా చూస్తాం



అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు ఆర్టీసీ బస్సులను వినియోగిస్తున్నప్పటికీ ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రత్యేక చర్యలు చేపడతాం. ఈ నెల 29, 30 తేదీల్లో ఆర్టీసీ సంస్థకు ప్రయాణికులు అన్ని విధాలుగా సహకరించాలి.

– శ్రీదేవి, ఆర్టీసీ ఆర్ఎం, నల్లగొండ

జంగ్ తెలంగాణ

సొంతూళ్లోనే ఓటు వేసేందుకు అవకాశం

- మునుగోడు నియోజకవర్గంలో నూతనంగా 9 పోలింగ్ స్టేషన్ల ఏర్పాటు

చండూరు: మునుగోడు నియోజకవర్గంలో ఎన్నికల అధికారులు నూతనంగా 9 పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేశారు. గట్టుప్పల్ మండలం శేరిగూడెంలో(పీఎస్ నం. 184), చండూరు మండలం పడమటి తాళ్ల గ్రామం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో (పీఎస్ నం. 218), చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో(పీఎస్ నం. 31), చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంలో గురుకుల బాలికల పాఠశాలలో (పీఎస్ నం. 33), చౌటుప్పల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో (పీఎస్ నం. 39), చౌటుప్పల్ మండలం చింతలగూడెం మండల ప్రాథమిక పాఠశాలలో (పీఎస్ నం. 51), నాంపల్లి మండలం షర్భానాపురం అంగన్‌వాడీ కేంద్రంలో (పీఎస్ నం. 289), నాంపల్లి మండలం సుంకిశాల మండల ప్రాథమిక పాఠశాలలో (పీఎస్ నం. 295), నాంపల్లి మండలం జానతండా (పీఎస్ నం. 264)లో నూతనంగా పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేశారు.



గట్టుప్పల్ మండలం శేరిగూడెంలో నూతనంగా ఏర్పాటు చేసిన పోలింగ్ స్టేషన్

ఆరు గ్యారంటీలు కచ్చితంగా అమలు చేస్తాం

- చెర్వుగట్టులో పూజలు చేసిన నకిరేకల్ కాంగ్రెస్ అభ్యర్థి వేముల వీరేశం
- ఆలయంలో బాండ్ పేపర్‌పై సంతకం

నార్కట్‌పల్లి: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఆరు గ్యారంటీలను కచ్చితంగా అమలు చేస్తామని నకిరేకల్ కాంగ్రెస్ అభ్యర్థి వేముల వీరేశం చెర్వుగట్టు పార్వతీజడల రామలింగేశ్వరస్వామి సాక్షిగా ప్రమాణం చేశారు. సోమవారం ఆయన నార్కట్‌పల్లి మండలంలోని చెర్వుగట్టు దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఏఐసీసీ, టీపీసీసీ ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలను కచ్చితంగా అమలు చేస్తామని బాండ్ పేపర్‌పై రాసి దేవుడి సాక్షిగా సంతకం చేసి ప్రమాణం చేసి మాట్లాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఏఐసీసీ ఇన్‌చార్జి ఫర్యాజ్, దైద రవీందర్, చాల శ్రీనివాస్, మండల పార్టీ అధ్యక్షుడు బత్తుల ఉషయ్య, మాజీ జెడ్పీటీసీ అలుగుబెల్లి రవీందర్‌రెడ్డి, దూదిమెట్ల సత్తయ్య, ఎంపీటీసీ పాశం శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు నేతగాని కృష్ణ, రమేష్, రేగట్టె నవీన్‌రెడ్డి, శశిధర్‌రెడ్డి, నర్సిరెడ్డి, జెర్రిపోతుల భారత్, సట్టు సత్తయ్య, రాదారపు భిక్షపతి, విజయలక్ష్మి, అచ్చాలు, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.



చెర్వుగట్టు దేవాలయంలో బాండ్ పేపర్‌పై సంతకం చేస్తున్న వేముల వీరేశం

అర్వపల్లి దేవాలయంలో మందుల సామేల్ ప్రమాణం

అర్వపల్లి: కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీలను కచ్చితంగా అమలు చేస్తామని అర్వపల్లిలోని శ్రీయోగానంద లక్ష్మీనర్సింహస్వామి దేవాలయంలో సోమవారం తుంగతుర్తి కాంగ్రెస్ అభ్యర్థి మందుల సామేల్ బాండ్ పేపర్ రాసి ప్రమాణం చేశారు. టీపీసీసీ ఆదేశాల మేరకు బాండ్ పేపర్‌తో ఆయన ఆలయంలో పూజలు చేశారు. అనంతర బాండ్ పేపర్‌ను చేతపట్టుకొని కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని ప్రమాణం చేశారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు దరూరి యోగానంద చారి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్ష, ఉపాధ్యక్షులు అనిరెడ్డి రాజేందర్‌రెడ్డి, నర్సింగ శ్రీనివాస్‌గౌడ్, మండల అధ్యక్షుడు మోరపాక సత్యం, శిగ నసీర్‌గౌడ్, దండ వీరారెడ్డి, లూనావత్ స్వాతిరవీందర్‌నాయక్, చెంచల శ్రీనివాస్, దిర్శనపు కృష్ణమూర్తి, బైరబోయిన మహరాజు తదితరులు పాల్గొన్నారు.



అర్వపల్లి లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో బాండ్ పేపర్ రాసిన మందుల సామేల్

సామాజిక న్యాయానికి పెద్దపీట



వంగపల్లిలో బీజేపీ కార్నర్ మీటింగ్‌కు హాజరైన ప్రజలు

- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ

భువనగిరి : సామాజిక న్యాయానికి నరేంద్ర మోదీ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ అన్నారు. సోమవారం భువనగిరి పట్టణ శివారులోని న్యూ వివేరా హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అగ్రకులాలకు రాష్ట్రపతి పదవి ఇచ్చిందని.. ప్రధాని నరేంద్ర మోదీ హయాంలో ఎస్సీ, ఆదివాసీలకు రాష్ట్రపతి పదవులు కట్టబెట్టిందన్నారు. ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని 30 ఏళ్లుగా ఉద్యమం చేస్తున్నామని, కానీ యూపీఏ ప్రభుత్వం అమలు చేయలేదన్నారు. బీసీలు ముఖ్యమంత్రి కావాలనే 67 ఏళ్ల ఆకాంక్ష బీజేపీ అధికారంలోకి వస్తే నెరవేరుతుందన్నారు. ఎస్సీ వర్గీకరణ కోసం కృషి చేస్తామని ప్రధాని చెప్పారని, చట్టసభల్లో కూడా మహిళా రిజర్వేషన్ తీసుకొవచ్చిన ఘనత మోదీకే దక్కుతుందన్నారు. అనంతరం మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ చట్టబద్ధత కోసం బీజేపీ ప్రభుత్వం కృషిచేస్తుందన్నారు. ఈ సమావేశంలో బీజేపీ భువనగిరి అభ్యర్థి గూడూరు నారాయణరెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పీవీ శ్యాం సుందర్‌రావు, జిల్లా ఇన్‌చార్జి సోము వీర్రాజు, రిటైర్డ్ డీజీపీ కృష్ణప్రసాద్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పోతంశెట్టి రవీందర్, పాశం భాస్కర్, విజయ భాస్కర్‌రెడ్డి, ఎస్సీ మోర్చా జాతీయ నాయకుడు వేముల అశోక్, కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పడమటి జగన్మోహన్‌రెడ్డి, బీజేపీ, ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.



ఆలేరు నియోజకవర్గం వంగపల్లి గ్రామంలో మాట్లాడుతున్న మంద కృష్ణమాదిగ

బీఆర్ఎస్, కాంగ్రెస్ మోసపూరిత పార్టీలు

యాదగిరిగుట్ట రూరల్ : బీఆర్ఎస్, కాంగ్రెస్ రెండూ మోసపూరిత పార్టీలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ అన్నారు. సోమవారం యాదగిరిగుట్ట మండలం వంగపల్లి గ్రామంలో బీజేపీ ఆలేరు అభ్యర్థి పడాల శ్రీనివాస్‌కు మద్దతుగా నిర్వహించిన రోడ్‌షోలో మంద కృష్ణమాదిగ మాట్లాడారు. కేసీఆర్ ప్రశ్నిస్తే అణచివేస్తాడని, నరేంద్ర మోదీ ఆదరించేవాడని అన్నారు. కేసీఆర్ దీక్ష చేస్తున్నప్పుడు నిమ్మ రసం ఇచ్చి దీక్షను విరమింపజేసిన తనపై కృతజ్ఞతాభావం లేకుండా.. ఇచ్చిన హామీలు ఏమయ్యాయని అడిగితే తనని రెండు సార్లు జైల్లో పెట్టాడని అన్నారు. తనపై ఉన్న ప్రేమాభిమానాలతో బీజేపీని, నరేంద్ర మోదీని ప్రజలంతా ఆదరించి అండగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఇన్‌చార్జి సోము వీర్రాజు, నాయకులు గుంటుపల్లి సత్యం, మంద శంకర్, చంద్రస్వామి పాల్గొన్నారు.

రూ.5లక్షలు పట్టివేత

యాదగిరిగుట్ట: ఎన్నికల నేపథ్యంలో అధికారులు వాహనాల తనిఖీలు ముమ్మరం చేశారు. సోమవారం యాదగిరిగుట్ట పట్టణంలోని గాంధీనగర్‌లో ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు వాహనాల తనిఖీలు చేపట్టి రూ.5లక్షలు పట్టుకుని సీజ్ చేశారు. ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి మణిబాబు తెలిపిన వివరాల ప్రకారం.. వెంకట్‌రెడ్డి అనే వ్యక్తి తన కారులో రూ.5లక్షలు తరలిస్తున్నాడనే సమాచారంతో గాంధీనగర్‌లో తనిఖీ చేపట్టామని, ఈ తనిఖీల్లో కారులో ఉన్న నగదును గుర్తించి ఎటువంటి ఆధారాలు లేకపోవడంతో సీజ్ చేశామన్నారు.

ఒకరి దుర్మరణం

ఆలేరురూరల్ : డీసీఎం ఢీకొని బైక్‌పై వెళ్తున్న వ్యక్తి మృతిచెందాడు. యాదగిరిగుట్ట మండలం మల్లాపురానికి చెందిన చిక్కుడు నర్సింహ(65) పని నిమిత్తం తన బైక్‌పై జనగామ జిల్లా పెంబర్తికి వెళ్లి తిరిగివస్తున్నాడు. మార్గమధ్యలో ఆలేరు మండలం కందిగడ్డతండా సమీపంలోకి రాగానే ఎదురుగా వస్తున్న డీసీఎం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నర్సింహ అక్కడికక్కడే మృతిచెందాడు.

బీఆర్ఎస్ హయాంలోనే గీత వృత్తికి గుర్తింపు



సమ్మేళనంలో మాట్లాడుతున్న గొంగిడి సునీత, వేదికపై మాజీ ఎమ్మెల్యే భిక్షమయ్యగౌడ్ తదితరులు

- ఆలేరు బీఆర్ఎస్ అభ్యర్థి గొంగిడి సునీత

ఆత్మకూరు(ఎం) : బీఆర్ఎస్ ప్రభుత్వంలోనే గీత వృత్తికి తగిన గుర్తింపు లభించిందని ఆలేరు బీఆర్ఎస్ అభ్యర్థి గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఆత్మకూరు(ఎం), మోటకొండూరు, గుండాల మండలాల స్థాయి గౌడ ఆశీర్వాద సమ్మేళనంలో ఆమె పాల్గొని మాట్లాడారు. గతంలో అధికారంలో ఉన్న పార్టీలు గీత కార్మికుల సమస్యలను పట్టించుకోలేదన్నారు. ఎన్నో పోరాటాలతో సాధించుకున్న తెలంగాణలో సీఎం కేసీఆర్ ప్రతి సమస్యకు ఒక సంక్షేమ పథకాన్ని పెట్టి అమలు చేస్తున్నారని తెలిపారు. గీత కార్మికుడు ప్రమాదవశాత్తు మరణిస్తే గతంలో రూ.2లక్షల ఎక్స్‌గ్రేషియా ఉండేదని, తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత రూ.5లక్షలు అందిస్తున్నామన్నారు. గౌడ కులస్తులకు తెలంగాణ ప్రభుత్వం హైదరాబాద్‌లో 5ఎకరాల స్థలంలో సర్వాయి పాపన్న భవన్ నిర్మిస్తున్నట్లు, దళిత బంధు తరహాలో గౌడ కులస్తులకు రూ.10లక్షల ఆర్థికసాయం అందించే విధంగా కేసీఆర్‌తో చర్చిస్తానన్నారు. గౌడ సోదరులు మూడోసారి ఆశీర్వదించి తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని ఆమె కోరారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్ మాట్లాడుతూ.. తెలంగాణ అభివృద్ధిని చూసి కాంగ్రెస్ నాయకులు ఓర్వలేక పోతున్నారని, గీత కార్మికుల సంక్షేమం కోసం తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. గౌడ సంఘం రాష్ట్ర నాయకుడు బీసు చందర్‌గౌడ్ అధ్యక్షతన నిర్వహించిన సభలో డీఎల్‌డీఏ చైర్మన్ మోతె పిచ్చిరెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సూదగాని హరిశంకర్‌గౌడ్, మార్కెట్ డైరెక్టర్ గడ్డం దశరథ గౌడ్, జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ గడ్డమీది పాండరీ, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు లగ్గాని రమేష్‌గౌడ్, నాయకులు బూడిద రాములుగౌడ్, ఈరగాని శ్రీనువాస్‌గౌడ్, బీసు ధనలక్ష్మి, కోల సత్తయ్య, గనగాని మల్లేశం గౌడ్, పంజాల వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్, కాంగ్రెస్‌లను తరిమికొట్టాలి

- మునుగోడు బీజేపీ అభ్యర్థి చలమల్ల కృష్ణారెడ్డి

చౌటుప్పల్ : ప్రజల ఓట్లతో ఎమ్మెల్యేలుగా గెలిచి పదవిని సొంత ప్రయోజనాలకు వాడుకున్న బీఆర్ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులను తరిమికొట్టాలని బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి చలమల్ల కృష్ణారెడ్డి ప్రజలను కోరారు. సోమవారం చౌటుప్పల్ పట్టణంలో ఎన్నికల ప్రచారం నిర్వహించి ఆయన మాట్లాడారు. పదవుల్లో ఉన్న సమయంలో ప్రజలను మరిచిన వ్యక్తులు ప్రస్తుతం మాత్రం హామీలు గుప్పిస్తున్నారని ధ్వజమెత్తారు. మాయమాటలతో మరోసారి మోసం చేసేందుకు వస్తున్న వ్యక్తులను ఓడించాలన్నారు. ఇద్దరు అభ్యర్థులు పదవులు పొందడం, ఆస్తులు కూడబెట్టుకోవడానికే ప్రాధాన్యం ఇచ్చారని విమర్శించారు. పుట్టిన గడ్డకు సేవ చేయాలన్న తపనతో ఎన్నికల్లో పోటీ చేస్తున్న తనను ఆశీర్వదించి గెలిపించాలని కోరారు. దశాబ్దాలుగా పేరుకుపోయిన సమస్యలన్నీ పరిష్కరిస్తానని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నుంచి పెద్ద ఎత్తున నిధులు తీసుకువచ్చి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానన్నారు. అనంతరం బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ గంగిడి మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ.. సేవ చేయాలన్న తపనతో ముందుకు వచ్చిన కృష్ణారెడ్డిని గెలిపించాలని కోరారు. అవినీతి బీఆర్ఎస్, అసమర్థ కాంగ్రెస్ పార్టీలను తరిమికొట్టాలన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు దోనూరి వీరారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు రమనగోని శంకర్, అసెంబ్లీ కన్వీనర్ దూడల భిక్షం, మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ పోలోజు శ్రీధర్‌బాబు, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు ఏసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఊడుగు వెంకటేశం, శివారెడ్డి, లింగస్వామి, గుజ్జుల సురేందర్ రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, వెంకటేశం, ధనుంజయ, మల్లికార్జున్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, పోలోజు శ్రీనివాస్‌చారి తదితరులు పాల్గొన్నారు.



చౌటుప్పల్ : ప్రజలకు అభివాదం చేస్తున్న బీజేపీ అభ్యర్థి చలమల్ల కృష్ణారెడ్డి, పక్కన మనోహర్‌రెడ్డి

జోష్ నింపిన ప్రియాంక



భువనగిరిలో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న ప్రియాంక గాంధీ, పక్కన మాణిక్‌రావ్ ఠాక్రే, భువనగిరి అభ్యర్థి కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి



మాట్లాడుతున్న భువనగిరి కాంగ్రెస్ అభ్యర్థి కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి



అభివాదం చేస్తున్న ప్రియాంక గాంధీ

యాదాద్రిలో వైభవంగా తులసీ కల్యాణం



కల్యాణోత్సవం ముందు తులసీ మొక్కకు పూజలు చేస్తూ దీపాలు వెలిగించిన భక్తులు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో కార్తీక మాసాన్ని పురస్కరించుకొని తులసీ కల్యాణాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీస్వామి అమ్మవార్లను ఆలయం నుంచి ప్రత్యేక సేవపై అలంకరించి ఊరేగింపుగా తూర్పు రాజగోపురం ముందుకు తీసుకువచ్చారు. అనంతరం తూర్పు మాఢవీధిలో భక్తుల కోలాహలం మధ్యన తులసీ కల్యాణాన్ని నిర్వహించారు. భక్తులు మాఢవీధిలో తులసీ మొక్కలకు పూజలు చేసి, దీపాలను వెలిగించారు. కల్యాణం అనంతరం ఆకాశ దీపోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైటీడీఏ వైస్ చైర్మన్ కిషన్‌రావు, ఈవో గీతారెడ్డి, అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తి, ఆలయ అర్చకులు, అధికారులు పాల్గొన్నారు.

యాదాద్రిలో కొనసాగుతున్న భక్తుల రద్దీ

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో భక్తుల రద్దీ కొనసాగుతుంది. వరుసల సెలవులతో పాటు సోమవారం కార్తీక పౌర్ణమి కలిసిరావడంతో భక్తులు యాదాద్రి క్షేత్రానికి భారీగా తరలివచ్చారు. దీంతో ఆలయ పరిసరాలు, క్యూలైన్లు, ప్రసాద విక్రయశాల వంటి ప్రాంతాల్లో భక్తుల సందడి నెలకొంది. కార్తీక మాసం సందర్భంగా కొండ కింద వ్రత మండపంలో శ్రీసత్యనారాయణస్వామి వ్రత పూజల్లో భక్తుల్లో అధికంగా పాల్గొన్నారు. ఆలయ మాఢ వీధిలో, శివాలయం చెంత కార్తీక దీపాలను భక్తులు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. అదే విధంగా రాత్రి ఆలయ తూర్పు రాజగోపురం ముందు దామోదర తులసీ పూజను ఆచార్యులు నిర్వహించారు. పూజలతో రూ.14,14,400 రాగా, నిత్యాదాయం రూ.67,52,572 వచ్చినట్లు అధికారులు వెల్లడించారు.

భక్తిశ్రద్ధలతో కార్తీక పౌర్ణమి వేడుకలు



భువనగిరి : దీపాలను వెలిగిస్తున్న మహిళలు, యువతులు

భువనగిరి : పట్టణంలోని పలు శివాలయాల్లో సోమవారం కార్తీక పౌర్ణమి వేడుకలను భక్తులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. సోమవారం కార్తీక పౌర్ణమి రావడంతో తెల్లవారుజాము నుంచే భక్తులు పట్టణంలోని శ్రీ పచ్చకట్ల సోమేశ్వరాలయం, రెడ్డివాడలోని శ్రీ భవానీరామలింగేశ్వరాలయం, ఆజాద్‌రోడులోని శివాలయం, ఖిలానగర్‌లో శివాలయం, దోబివాడలోని దక్షిణేశ్వరాలయంలో దర్శనం కోసం బారులుదీరారు. ఈ సందర్భంగా మహిళలు, యువతులు కార్తీక దీపాలను వెలిగించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకు ముందు శివలింగాలకు అభిషేకాలు నిర్వహించారు. అనంతరం సామూహిక సత్యనారాయణ వ్రతాలను నిర్వహించారు. శ్రీపచ్చలకట్ట సోమేశ్వరాలయంలో కాంగ్రెస్ అభ్యర్థి కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి సతీమణి కిరణ్‌జ్యోతి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



భూదాన్‌పోచంపల్లి : జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సినీనటి ఆమని, పైళ్ల శేఖర్‌రెడ్డి సతీమణి వనిత తదితరులు

కనులపండువగా కార్తీక జలదీపోత్సవం

భూదాన్‌పోచంపల్లి : పట్టణంలోని శ్రీలక్ష్మీనారాయణస్వామి దేవాలయంలో సోమవారం కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని జలదీపోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సినీ నటి ఆమని, భువనగిరి ఎమ్మెల్యే సతీమణి పైళ్ల వనిత శేఖర్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ చిట్టిపోలు విజయలక్ష్మీ శ్రీనివాస్, మాజీ ఎంపీపీ సార సరస్వతీ, కౌన్సిలర్ మోటె రజిత రాజుతో కలిసి ప్రమిదలను వెలిగించి నీటిలో వదిలారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే శ్రీమార్కండేశ్వర స్వామి దేవాలయంలో శివలింగాకారంలో వెలిగించిన ప్రమిదలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమంలో దేవాలయ కమిటీ చైర్మన్ అంకం యాదగిరి, తడక రమేశ్, అంకం మురళి, కౌన్సిలర్ మోటె రజితరాజు, నాయకులు పాల్గొన్నారు.